వేంకటేశ్వర స్వామి నగర సంకీర్తన

జగద్గిరిగుట్ట: చింతల్‌, పద్మనగర్‌ ఫేజ్‌–1 లో శ్రీ శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి పాటలు పాడుతూ కాలనీల్లోని వీధుల్లో తిరిగారు.

జనవరి 4 నుంచి పూజలు..

ధనుర్మాసం సందర్భంగా జనవరి 4వ తేదీన ఆలయంలో లక్ష పుష్పార్చన, 8న సాయంత్రం దీపోత్సవం పొన్నాకుల హారతి, 10న ఉత్తర ద్వారా దర్శనం, 11న కుడారై ఉత్సవం 13న గోదారంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

ఫుట్‌బాల్‌లో సత్తా చాటిన నవనీత్‌ వర్మ



సాక్షి, సిటీబ్యూరో: యంగ్‌ డైనమోస్‌ క్లబ్‌ నిర్వహించిన ఫుట్‌బాల్‌ టోర్నమెంట్‌లో బాచుపల్లికి చెందిన బోరుకాటి నాగ నవనీత్‌ వర్మ సత్తా చాటాడు. ఓల్డ్‌ అల్వాల్‌లోని లయోలా అకాడమీ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు ‘బేబీ లీగ్‌ కమ్‌ నాకౌట్‌– 2024 పేరిట 8వ ఎడిషన్‌ టోర్నమెంట్‌ జరిగింది. వాసన్‌ – సాగి కల్యాణ్‌ మెమోరియల్‌ పేరిటి నిర్వహించిన ఈ టోర్నీలో బాచుపల్లికి చెందిన అండర్‌–12 స్కోర్‌ కోచింగ్‌ అకాడమీ కోచ్‌ రాము ఆధ్వర్యంలో ఈ జట్టు తలపడింది. గోల్‌ కీపర్‌ నవనీత్‌ వర్మ టోర్నమెంట్‌ ఉత్తమ గోల్‌ కీపర్‌గా నిలిచారు. దీంతో నవనీత్‌ వర్మను కుత్బుల్లాపూర్‌ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ గౌడ్‌ ప్రశంసించారు.

ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థికి అరుదైన గౌరవం



విద్యార్థి భాగేష్‌కు సర్టిఫికెట్‌ అందజేస్తున్న ప్రిన్సిపాల్‌ నాగేందర్‌

సుభాష్‌నగర్‌: కుత్బుల్లాపూర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఎంపీసీ విద్యార్థి భాగేష్‌కు అరుదైన గౌరవం దక్కింది. యోగా భుజ పీడాసనంలో రికార్డు సాధించి ఇంటర్నేషనల్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో చోటు సాధించాడు. దీంతో కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ నాగేందర్‌ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం భాగేష్‌ను రికార్డుకు సంబంధించిన సర్టిఫికెట్‌ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉపేందర్‌రావు, పరశురామ్‌ తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు విరమణ సహజం



ఓంకార్‌ను సత్కరిస్తున్న వైద్యాధికారులు

దుండిగల్‌: ప్రభుత్వోద్యోగులకు విరమణ సహజమని మేడ్చల్‌ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్‌ రఘునాథస్వామి అన్నారు. దుండిగల్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్‌ ఓంకార్‌ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి స్వర్ణలత ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్‌ సత్యావతి, కీసర డివిజన్‌ డిప్యూటీ జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్‌ మల్లీశ్వరి, జిల్లా కార్యక్రమాధికారి డాక్టర్‌ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో షెడ్‌ నిర్మాణం!



జగద్గిరిగుట్ట: డివిజన్‌ పరిధిలోని వార్డు ఆఫీస్‌ సమీపంలో వినాయక చవితి సందర్భంగా తాత్కాలిక మండపం ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు ఏకంగా అదే స్థలంలో పర్మనెంట్‌ షెడ్‌ వేసేందుకు యత్నిస్తున్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే గణేష్‌ చవితికి ప్రభుత్వ స్థలంలో పర్మనెంట్‌ షెడ్‌ వేయడం తగదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవలే ఈ వార్డు ఆఫీస్‌కు ఆనుకుని మహిళా శక్తి క్యాంటీన్‌ ఏర్పాటు చేశారు. దాని పక్కనే ఈ షెడ్డు నిర్మాణం జరుగుతున్నా..అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి షెడ్డు పనులు ఆపివేయాలని వారు కోరుతున్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

నిజాంపేట్‌: కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని నిజాంపేట్‌ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్‌ కోరారు. ఈమేరకు మేడ్చల్‌ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాచుపల్లి వీఎన్‌ఆర్‌ వీజేఐఈటీ యాజమాన్యం సర్వే నంబర్‌ 186 లో ఆక్రమించిన 1.36 ఎకరాల భూమిపై నోటీసులు జారీ చేసినా ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోలేదన్నారు. అదేవిధంగా గండిమైసమ్మలోని బీఆర్‌ఎస్‌ జిల్లా కార్యాలయానికి కోట్లాది రూపాయల విలువ చేసే ఎకరం ప్రభుత్వ స్థలాన్ని రూ.40 లక్షలకు కారు చౌకగా ఇచ్చారని, అయితే మరో 20 గుంటల స్థలాన్ని కలిపి కార్యాలయాన్ని నిర్మించారన్నారు. తక్షణమే ఆయా ప్రభుత్వ భూముల్లో సర్వే నిర్వహించి స్థలాలను పరిరక్షించాలని కోరారన్నారు. ఆయన వెంట అరుణ్‌రావు, ఈశ్వర్‌రెడ్డి, కుమార్‌గౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌ పాల్గొన్నారు.



జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం ఇస్తున్న మల్లారెడ్డి, జేకే శేఖర్‌ యాదవ్‌

సంజయ్‌గాంధీనగర్‌లో సౌకర్యాలు కల్పించాలి

రంగారెడ్డినగర్‌: సంజయ్‌గాంధీనగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంక్షేమ సంఘం నాయకులు ప్రజావాణిలో కుత్బుల్లాపూర్‌ ఉప కమిషనర్‌ నరసింహకు వినతి పత్రం అందజేశారు. బస్తీలోని హిందూ శ్మశాన వాటిక ప్రహరీ ఎత్తును పెంచాలని, అంతర్గతంగా సీసీ రోడ్లు, విద్యుత్‌ స్తంభాలు వేయాలని సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్‌ముదిరాజ్‌ ఉపకమిషనర్‌ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన తగు చర్యలు చేపట్టాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బండారి నారాయణ, మొగిలి బాబుయాదవ్‌ ఉన్నారు.

కుత్బుల్లాపూర్‌లో సమస్యలు పరిష్కరించాలి

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్‌ అసెంబ్లీ కన్వీనర్‌ జేకే శేఖర్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. జగద్గిరిగుట్టలో యాదవభవన్‌ ఏర్పాటు చేయాలని, సబ్‌స్టేషన్‌ నుంచి వయ గూబురుగుట్ట శ్మశాన వాటిక నుంచి వెంకట రామ్‌రెడ్డినగర్‌ వరకు రింగ్‌ రోడ్‌ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సిద్ధి వినాయకనగర్‌లోని పార్కు స్థలంలో అక్రమంగా ప్రైవేట్‌ బస్సులు నిలుపుతున్నారని దాని చుట్టూ ప్రహరీ నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో దారం సాయికుమార్‌, లక్ష్మీనారాయణ శ్రీనివాస్‌ గౌడ్‌, రాజు యాదవ్‌, జగన్‌, భిక్షపతి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు న్యాయం చేయాలి

జగద్గిరిగుట్ట: చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్ప సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో గాజులరామారం ఉపకమిషనర్‌ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్‌గృహకల్ప సర్వే నంబర్‌ 348/1లోని వార్డు కార్యాలయం పక్కన 13 ఏళ్లుగా నిరుపేదలు డబ్బాలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారన్నారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ అధికారులు సదురు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, దీంతో చిరు వ్యాపారుల కుటుంబాలు రోడ్డునే పడే అకాశముందన్నారు. మానవతా దృక్పథంతో ఆలోచించి సదరు స్థలంలో డబ్బాలు కొనసాగించేలా అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై ఉప కమిషనర్‌ సానుకూలంగా స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. రాజీవ్‌గృహకల్ప నాయకులు, సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు గార్లపాటి ప్రభాకర్‌, ధర్మారపు అంజయ్య, చిరువ్యాపారులు బాన్సువాడ వెంకటేశ్‌, నాగభూషణం, మహేశ్‌ తదితరులు ఉన్నారు.



మేడ్చల్‌ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న సతీశ్‌ తదితరులు



ఉపకమిషనర్‌ నరసింహకు వినతి పత్రం ఇస్తున్న సభ్యులు



ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

‘అమిత్‌ షాను వెంటనే బర్తరఫ్‌ చేయాలి’



నిరసన ర్యాలీలో సీపీఐ, సీపీఎం నాయకులు

కుత్బుల్లాపూర్‌: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్‌ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా చేసిన వ్యాఖ్యలు హేయమని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్‌, జిల్లా కార్యదర్శి సత్యం, సీపీఐ కుత్బుల్లాపూర్‌ మండల కార్యదర్శి ఉమామహేశ్‌ డిమాండ్‌ చేశారు. సీపీఐ, సీపీఎం కుత్బుల్లాపూర్‌ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌ రైతుబజార్‌ నుంచి ఉషోదయ టవర్స్‌ వరకు సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమిత్‌ షా, బీజేపీ నాయకుల ఆలోచనలు మతతత్వంతో ఉన్నాయని, రాజ్యాంగంపై వారికి నిజమైన గౌరవం లేదని మరోసారి రుజువయ్యిందన్నారు. అమిత్‌ షాను మంత్రివర్గం నుంచి తొలగించేవరకు ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రావుల స్వాతి, ఈ. దేవదానం డి. కరుణాకర్‌ కే శీను తిమ్మప్ప, భాష, సీపీఐ మండల నాయకులు నరసింహరెడ్డి, రాము చంద్రకాంత్‌, బోనాల కనకయ్య, గుర్రప్ప, సుంకిరెడ్డి శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



జాఫర్‌ హుస్సేన్‌ (ఫైల్‌)

కుత్బుల్లాపూర్‌: వ్యక్తి అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు కమలానగర్‌కు చెందిన జాఫర్‌ హుస్సేన్‌ దేవరయాంజాల్‌లోని స్టోరేజ్‌ సిస్టం ప్రైవేట్‌ లిమిటెడ్‌లో పని చేస్తున్నాడు. కాగా నగరానికి కొత్తగా వచ్చిన హుస్సేన్‌ ఈ నెల 26న మధ్యాహ్నం 2:40 గంటలకు భోజనం చేసేందుకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పరిశ్రమ సిబ్బంది చుట్టు పక్కలా వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీ షీటర్లకు ఏసీపీ కౌన్సెలింగ్‌

బాలానగర్‌: బాలానగర్‌ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ హనుమంతరావు రౌడీ షీటర్లకు సోమ వారం కౌన్సెలింగ్‌ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జైలుకు తరలిస్తామన్నారు. క్షణికావేశంలో తప్పులు చేస్తే వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. మంచి ప్రవర్తన కలిగి ఉండే వారిపై షీట్‌ ఎత్తివేస్తామన్నారు. డీఎస్‌ఐ సుభాష్‌ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థి మాధవ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

సుభాష్‌నగర్‌: జాతీయ స్థాయి స్పోర్ట్స్‌ చాంపియన్‌షిప్‌లో గాజురామారంలోని విజ్ఞాన్‌ ఉషోదయ స్కూల్‌ విద్యార్థి ప్రతిభ చూపాడు. ఈ నెల 28, 29 తేదీల్లో పుదుచ్చేరిలోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరిగిన ఐదో లాఠీ నేషనల్‌ స్పోర్ట్స్‌ చాంపియన్‌షిప్‌లో విద్యార్థి కట్టిరెడ్డి మాధవ్‌ కాంస్య పతకాన్ని సాధించాడు. సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్‌ జానెట్‌ అంగారి మాధవ్‌తో పాటు కోచ్‌ అక్బర్‌ మొహమ్మద్‌ను అభినందించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

దుండిగల్‌: పదో వార్డులోని లాల్‌బహదూర్‌నగర్‌లో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు దుండిగల్‌ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పద్మారావు స్థానిక కౌన్సిలర్‌ బొంగునూరి నవితాతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేడ్చల్‌ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ బొంగునూరి శ్రీనివాస్‌ రెడ్డి, కౌన్సిలర్లు శంభీపూర్‌ కృష్ణ, రాముగౌడ్‌, గోపాల్‌ రెడ్డి, సాయి యాదవ్‌, నేతలు నిరంజన్‌, లోకేశ్‌, మిద్దెల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

జీడిమెట్ల: భవనంపై నుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన జీడిమెట్ల పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కోనకానమెట్ల మండలం సిద్దవరం గ్రామానికి చెందిన చెంచు రామయ్య (45) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జీడిమెట్ల ఎస్‌ఆర్‌ నాయక్‌నగర్‌లో ఉంటున్నాడు. బొల్లారంలోని థర్మల్‌ సిస్టమ్స్‌లో పనిచేస్తున్నాడు. రామయ్య ఆదివారం రాత్రి 9 గంటలకు సిగరెట్‌ తాగేందుకు తను ఉంటున్న ఇంటి నాలుగో అంతస్తుకు వెళ్లాడు. అక్కడే గోడపై కూర్చుని సిగరెట్‌ తాగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. పైకి వెళ్లిన రామయ్య ఇంట్లోకి రాకపోవడంతో నైట్‌ డ్యూటీకి వెళ్లాడని రామయ్య భార్య విజయలక్ష్మి అనుకున్నది. సోమవారం తెల్లవారుజామున వాచ్‌మెన్‌ వచ్చి రామయ్య బిల్డింగ్‌పై నుంచి కిందపడి మృతిచెంది ఉన్నాడని విజయలక్ష్మికి చెప్పాడు. ఆమె వెళ్లి చూడగా రాళ్లపై పడి తీవ్రగాయాలతో మృతిచెంది ఉన్నాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శవ పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. రామయ్యకు భార్య విజయలక్ష్మి, కుమారుడు తేజ (7) ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెంచు రామయ్య (ఫైల్‌)

వడ్డెర కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌



హాజరైన వడ్డెర కులస్తులు

కుత్బుల్లాపూర్‌: వడ్డెర కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నేత కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. ఆల్‌ ఇండియా వడ్డెర సంఘం జనరల్‌ సెక్రటరీ గుంజ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో సంఘం నేతలు సోమవారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2006లో తన తల్లి కూన మహాలక్ష్మి పేరిట వడ్డెరుల ఇళ్లకు ఉచితంగా పట్టాలు పంపిణీ చేశానని గుర్తుచేశారు. అధికారంలో ఉన్నా లేకున్నా పేద, బడుగు, బలహీన వర్గాల కోసం కృషి చేస్తానని, అన్ని కులాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమం జాతీయ యువజన అధ్యక్షుడు రమేశ్‌ ముంజల్కర్‌, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రమ, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు సాతాల గోపాల్‌, రాష్ట్ర జనరల్‌ సెక్రెటరీ నగేశ్‌, రాష్ట్ర యూత్‌ అధ్యక్షుడు బొంత చిరంజీవి, రాష్ట్ర యూత్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బి. శ్రీనివాస్‌, మేడ్చల్‌ జిల్లా యువజన అధ్యక్షుడు ఎస్‌ మురళి, జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యదర్శి చిన్న తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు



‘సాక్షి’లో ప్రచురితమైన వార్త



మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన మూత

జీడిమెట్ల: ‘మ్యాన్‌హోల్‌ జరభద్రం’ అనే శీర్షికన ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్‌ శానిటేషన్‌ సిబ్బంది స్పందించారు. సుభాష్‌నగర్‌లోని 40 ఫీట్ల రోడ్డులోని ఓ భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌పై మూత లేకుండా నెలరోజులుగా ప్రమాదకరంగా మారగా కుత్బుల్లాపూర్‌ శానిటేషన్‌ సిబ్బంది ఉదయం మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సుభాష్‌నగర్‌: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని జీడిమెట్ల ట్రాఫిక్‌ సీఐ శ్రీనివాస్‌ సూచించారు. డిసెంబర్‌ 31 విషయమై సోమవారం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని అన్ని ప్రాంతాలు, కూడళ్లలో తమ సిబ్బంది మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున వరకు విధుల్లో ఉంటారన్నారు. డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌, ర్యాష్‌ డ్రైవింగ్‌, ట్రిపుల్‌ రైడింగ్‌, నో పార్కింగ్‌ వంటి వాటిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. న్యూ ఇయర్‌ వేడుకల సందర్భంగా రోడ్లపై కేక్‌, బిర్యానీ దుకాణాలు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే వాటిని తొలగిస్తామని పేర్కొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్‌ సీఐ శ్రీనివాస్‌

రోడ్డు పక్కనే చెత్తడంపింగ్‌..!



గోదావరి హోమ్స్‌ సమీపంలో రోడ్డు పక్కనే చెత్త

కుత్బుల్లాపూర్‌: జీడిమెట్ల డివిజన్‌ పరిధిలోని వెన్నెలగడ్డ నుంచి గోదావరి హోమ్స్‌ గాయత్రీనగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనే చెత్త డంపింగ్‌ చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఇక్కడి చెత్తను తొలగించకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దీంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్‌: ఫీడర్‌ లైన్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని షాపూర్‌నగర్‌ సెక్షన్‌ ఏఈ కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ శ్రీరామ్‌నగర్‌, వెంకట్రామ్‌నగర్‌, రాజీవ్‌గాంధీనగర్‌, సాయిబాబానగర్‌ ఫీడర్ల పరిధిలోని శ్రీరామ్‌నగర్‌, వెంకట్రామ్‌నగర్‌, వైష్ణవినగర్‌, కృష్ణనగర్‌, సాయిబాబానగర్‌, రాజీవ్‌గాంధీనగర్‌ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పలు ఫీడర్ల పరిధిలో..

కుత్బుల్లాపూర్‌: సుభాష్‌నగర్‌ సబ్‌స్టేషన్‌ వార్షిక నిర్వహణ నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు మేడ్చల్‌ ఏడీఈ లైన్స్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ప్రాగా టూల్స్‌, బ్యాంక్‌ కాలనీ, దుర్గా ఎస్టేట్స్‌, రామరాజునగర్‌, జయరాంనగర్‌, సుచిత్ర, జీడిమెట్ల గ్రామం, పైపులైన్‌ రోడ్డు, గాయత్రీనగర్‌, మీనాక్షి , సాయిబాబానగర్‌, పద్మానగర్‌, జైన్‌ కన్‌స్ట్రక్షన్స్‌ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి గమనించాలని ఆయన కోరారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



మైసమ్మనగర్‌ బొడ్రాయి వద్ద పూజలు..

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకుని డివిజన్‌ పరిధిలోని పలు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, అన్నదానాలు నిర్వహించారు. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయంలో, జగద్గిరిగుట్ట లాస్ట్‌ బస్టాప్‌ దుర్గమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. దుర్గమ్మ ఆలయం వద్ద శ్రీ వాసవీ సేవా సమితి, కాళికామాతా ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. అలాగే మగ్దూంనగర్‌, మైసమ్మనగర్‌లో బొడ్రాయిల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీసాయిగణేశ్‌ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో..

రంగారెడ్డినగర్‌: అమావాస్యను పురస్కరించుకుని శ్రీసాయిగణేశ్‌ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పంచశీలకాలనీలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని శ్రీ సాయిగణేశ్‌ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మోతే రాజేశ్వర్‌, రవితేజ ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు జింకల వెంకటేశ్‌ముదిరాజ్‌ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి రోడ్‌వేస్‌ అధినేత సూర్యనారాయణ గురుస్వామి, బాషయ్య, దాత అంబాదాస్‌, శంకర్‌ నాయక్‌, సంజీవ్‌, రాంబాబు, ప్రకాశ్‌, వెంకటరమణ పాల్గొన్నారు.



లాస్ట్‌ బస్టాప్‌లోని దుర్గమ్మ అమ్మవారు



జగద్గిరిగుట్ట కొండపై అలంకరణలో కాళికాదేవి



మగ్దూంనగర్‌లో బొడ్రాయి వద్ద పూజలు..



పంచశీల కాలనీలో అన్నదానం..